# నమస్తే తెలంగాణ
# నల్లగొండ
I నల్లగొండ, బుధవారం 30 ఏప్రిల్ 2025 NALGONDA




ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆర్టీసీ నల్లగొండ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి

## ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 29 : ఆర్టీసీ నల్లగొండ రీజియన్ త్రైమాసిక ప్రగతి చక్రం పురస్కారాల్లో భాగంగా ఉమ్మడి జిల్లా పరిధిలోని డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ గ్యారేజీ సిబ్బందిని అధికారులు సన్మానించారు. పట్టణంలోని యాదగిరిగుట్ట ఆర్టీసీ బస్సు డిపోలో బుధవారం 7 డిపోల పరిధిలో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జానిరెడ్డి, డిప్యూటీ రీజనల్ మేనేజర్లు, వివిధ ఆర్టీసీ డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

చందంపేట(దేవరకొండ), ఏప్రిల్ 29 : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ మండలంలోని మడమడక గ్రామానికి చెందిన పలువురు దేవరకొండ పట్టణంలో సోమవారం ఆయన సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అఖండ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కేసీఆర్ హయాంలో అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచిగా నిలిచాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతపల్లి సుభాశ్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, చాట్ల రాములు, వాజిద్, తులసిరాం, ప్రవీణ్, వడ్త్య గణేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూలో అక్రమార్కులు

**రికార్డుల టాంపరింగ్‌లు... అక్రమ రిజిస్ట్రేషన్లు**





## డబ్బులు ముడితే చాలన్నట్లు కొందరి తీరు

- **బయట పడితే సస్పెన్షన్.. లేదంటే కాసుల వర్షం**
- **ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారికే వివరాల సేకరణ బాధ్యతలు**

**రెవెన్యూ శాఖలో అవినీతి, అక్రమాలు విచ్చలవిడి అవుతున్నాయి. లక్షల్లో డబ్బులు దండుకొని ఏకంగా భూ రికార్డులను సైతం టాంపరింగ్ చేస్తున్నారు. నకిలీ పత్రాలు సృష్టించడం, అన్నీ సక్రమంగా ఉన్నా భూ యజమానులకు తీరని అన్యాయం చేయడం.. వివాదాల్లో ఉన్న భూములు కొలిక్కి రాకముందే పెద్ద మొత్తంలో తీసుకొని వేరొకరికి కట్టబెట్టడం వంటివి ఇటీవల తరచూ వెలుగులోకి వస్తున్నాయి. కొద్ది నెలల కిందట అక్రమాలకు పాల్పడిన అప్పటి హుజూర్‌నగర్ తాసీల్దార్ వజ్రాల జయశ్రీని సస్పెండ్ చేయడంతో జైలుకు కూడా వెళ్లారు. కంప్యూటర్ ఆపరేటర్ జగదీశ్‌ను అధికారులు టెర్మినేట్‌ను చేశారు. కోదాడలో తాసీల్దార్ సాయిగౌడ్ బదిలీ అయ్యారు. ఆర్ఐ సుజిత్‌ను సస్పెండ్ చేశారు. కంప్యూటర్ ఆపరేటర్ వెంకయ్యను టెర్మినేట్ చేశారు. మోతెలో తాసీల్దార్ సంఘమిత్ర సస్పెండ్ అవడంతోపాటు జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఆర్ఐలు నిర్మల, మన్సూర్ అలీతోపాటు, గతంలో పని చేసిన మరో ఆర్ఐ అజయ్, కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజు సస్పెండ్ అయ్యారు.**

– సూర్యాపేట, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ)

తాజాగా ఆత్మకూర్.ఎస్ మండలంలో నకిలీ పత్రాలు సృష్టించి రూ.5కోట్ల విలువైన భూమిని ఒకరికి కట్టబెట్టగా ఇందులో తాసీల్దారు కార్యాలయంతో పాటు ఓ డివిజనల్ స్థాయి అధికారి పాత్ర కూడా ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో డిప్యూటీ తహసీల్దార్‌ను కలెక్టరేట్‌కు బదిలీ చేసి కథను ముగించడం గమనార్హం. కోర్టు పరిధిలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసిన ఘనులు చివ్వెంల మండలంలో ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో పలుచోట్ల రెవెన్యూ శాఖలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరుగుతుండగా బయటపడితే సస్పెన్షన్, శాఖాపరమైన చర్యలు.. లేదంటే జేబులు నింపుకోవడం సహజంగా మారింది.

గత ప్రభుత్వం రెవెన్యూ శాఖలో తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన చర్యలతో చాలావరకు కట్టడి అయింది. తిరిగి ఇప్పుడు మళ్లీ అక్రమార్కులు అవకాశం ఉన్న మేరకు అవినీతికి పాల్పడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల మోతె మండలంలో పెద్దఎత్తున రికార్డుల టాంపరింగ్‌కు పాల్పడి లక్షలాది రూపాయలు తీసుకొని అక్రమ రిజిస్ట్రేషన్లు చేసినందుకు గాను తాసీల్దార్, ఇద్దరు ఆర్ఐలు, కంప్యూటర్ ఆపరేటర్‌పై కేసులు నమోదయ్యాయి. కొందరు జైలుకు కూడా వెళ్లారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడినందుకు అంతకు ముందు హుజూర్‌నగర్, కోదాడలోనూ రెవెన్యూ అధికారులపై వేటు పడింది.

ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని నెమ్మికల్‌లో ఓ భూమికి సంబంధించి తాసీల్దారు కార్యాలయం నుంచి నెల వ్యవధిలోనే మూడు తీర్లుగా వేర్వేరు రిపోర్టులు ఇవ్వడం, నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. ఇందులో తాసీల్దార్ కార్యాలయం అధికారులతోపాటు సూర్యాపేట ఆర్డీఓ పాత్ర కూడా ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఎలాంటి సస్పెన్షన్లూ లేకపోగా కేవలం డిప్యూటీ తాసీల్దారును కలెక్టరేట్‌కు బదిలీ చేసి కథను ముగించారని వాపోతున్నారు. నెమ్మికల్‌లోని సర్వే నెంబర్ 75లో నిమ్మల భారతమ్మకు ఐదెకరాల భూమి ఉండగా, చాలాకాలంగా అది ప్రొహిబిటెడ్ జాబితాలో పడింది. మరో పక్క అధికారులు సదరు భూమిపై భారతమ్మ కబ్జాలో ఉన్నారని, సాగు చేస్తున్నారని రిపోర్ట్ ఇచ్చారు. మరోసారి అదే భూమిపై సంధ్య అనే మరో మహిళ కబ్జాలో ఉన్నట్లు ఇంకొక రిపోర్ట్ కూడా ఇవ్వడంతో జిల్లా కలెక్టర్‌కు భారతమ్మ ఫిర్యాదు చేశారు. విచారణకు కలెక్టర్ ఆదేశించడంతో ఆ భూమిపై ఎవరికీ సరైన పత్రాలు లేవంటూ మరొక రిపోర్ట్ ఇచ్చారు. భారతమ్మకు పాస్‌పుస్తకం ఉండడం, పహానీల్లో పేరు ఉండడం, కబ్జాలో కూడా ఉండగా మూడు రిపోర్టులు ఇచ్చిన అదే అధికారులు ఆరు నెలల క్రితం నకిలీ పత్రాలు సృష్టించి సంధ్యకు రిజిస్ట్రేషన్ చేశారని భారతమ్మ ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం తతంగంలో దాదాపు రూ.40లక్షల వరకు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో డిప్యూటీ తాసీల్దార్, ఓ డివిజనల్ స్థాయి అధికారితోపాటు మరికొంతమంది అధికారులు, ఉద్యోగుల పాత్ర ఉందని భారతమ్మ ఆరోపణలు చేస్తున్నారు. కాగా, ఈ వ్యవహారంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి ద్వారానే ఉన్నతాధికారులు రిపోర్ట్‌లు తెప్పించుకుంటుండడం గమనార్హం. ఇలా అయితే తమకు న్యాయం ఎలా జరుగుతుందని భారతమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమాలకు బాధ్యులైన వారిని సస్పెండ్ చేయడంతో పాటు తమ భూమిని తమకు రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబును నమస్తే తెలంగాణ వివరణ కోరగా.. విచారణ కొనసాగుతున్నదని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తి లేదన్నారు. ఆర్డీఓ ద్వారా రికార్డులు, రిపోర్ట్ మాత్రమే తెప్పించుకోవడం జరిగిందని తెలిపారు.



రామన్నపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## కలెక్టర్‌వా... కాంగ్రెస్ ఏజెంట్‌వా?

- **ధరణిపై అధికారుల ఆరోపణలు సరికాదు**
- **భూ భారతి కబ్జా కాలమ్‌తో రైతులకు నష్టం**
- **మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

రామన్నపేట, ఏప్రిల్ 29 : ధరణి చట్టంపై ఆరోపణలు చేస్తూ యాదాద్రి భువనగిరి కలెక్టర్, ఇతర అధికారులు వేదికల మీద మాట్లాడటం సరికాదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కలెక్టర్‌వా లేక కాంగ్రెస్ పార్టీ ఏజెంట్‌వా అంటూ మండిపడ్డారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణిని విమర్శిస్తూ, భూభారతిని పొగుడుతూ కలెక్టర్ హనుమంతరావు పదే పదే ప్రజలతో చప్పట్లు కొట్టిస్తుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధరణిలో లోపాలు ఉంటే ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. భూ భారతి చట్టంలో ఏర్పాటు చేసిన కబ్జా కాలమ్ వల్ల రైతులకు నష్టం జరుగుతుందన్నారు. నార్కట్‌పల్లి మండలం గోపాలయపల్లి గ్రామంలో 550 సర్వే నంబర్‌లోని గోపాల్ అనే రైతు భూమిని ఒక సంస్థ కబ్జా చేసి నిర్మాణం చేపట్టిందని, ఆ జిల్లా కలెక్టర్ పరిశీలించి నిర్మాణాలు తొలగించాలని ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. విధి లేని స్థితిలో బాధిత రైతు తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అనేక అడ్డంకులను ఛేదించుకొని బీఆర్ఎస్ రజతోత్సవ సభను ప్రజలు భారీ విజయవంతం చేయడంతో ఏంచేయాలో పాలుపోక మంత్రులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. బురద జల్లే ప్రయత్నం మానుకుని హామీల అమలుపై దృష్టి సారించాలని హితవు పలికారు. జిల్లా మంత్రులు 16 నెలల్లో ఉమ్మడి జిల్లాకు చేసిన మేలు ఏంటో తెలుపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోశబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, పున్న వెంకటేశం, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు ఎస్కే చాంద్, బత్తుల వెంకటేశం, కూనూరు మత్తయ్య, ఎండీ ఆమేర్, ఆవుల నరేందర్, బండ శ్రీనివాస్‌రెడ్డి, ఆవుల శ్రీధర్, కర్రె శ్రీను, బత్తిని నాగరాజు, నోముల లింగస్వామి, కుక్క సాయి పాల్గొన్నారు.



మోటకొండూర్ మండలంలోని కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్‌లో బాంబు పేలడంతో నేల మట్టమైన 18 ఏ-బ్లాక్ భవనం

## పీఈఎల్‌లో భారీ పేలుడు

- **కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో ప్రమాదం**
- **కార్మికుడి దుర్మరణం, శిథిలాల కింద మరో ఇద్దరు**

మోటకొండూర్/ యాదగిరిగుట్ట, ఏప్రిల్ 29 : యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలోని 18 ఏ-బ్లాక్ భవనంలో మంగళవారం శ్రీహరికోటలో రాకెట్ లాంచ్‌లో ఉపయోగించే ప్రొఫలెంట్ తయారు చేస్తున్న సమయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంతో భవనం పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో అందులో తొమ్మిది మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన కల్వల నరేశ్ (30)కు తీవ్రగాయాలు కాగా.. దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందాడు. మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన దేవిచరణ్(20), కాటేపల్లికి చెందిన గునుకుంట్ల సందీప్ (30) భవనం శిథిలాల కింద గల్లంతయ్యారు. వారి ఆచూకీ ఇంకా తెలియలేదు. వలిగొండ మండలం పుల్లిగిల్లకు చెందిన బుగ్గ లింగస్వామి, మోటకొండూర్ మండలం చాడ గ్రామానికి చెందిన శ్రీకాంత్, యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి చెందిన శ్రీకాంత్, పెద్దకందుకూరుకు చెందిన మహేందర్‌తో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయ్యాలయ్యాయి. వారిని భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. భవనం శిథిలాల కింద గల్లంతైన ఇద్దరి కోసం కంపెనీలో పని చేసే సిబ్బంది గాలిస్తున్నారు. పేలుడుతో వచ్చిన శబ్దంతో దాదాపు ఏడు కిలోమీటర్ల మేర భూమి కంపించడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

### బాధిత కుటుంబాల ఆందోళన

కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో క్షతగాత్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబాల సభ్యులు, గ్రామస్తులు కంపెనీ ఎదుట, భువనగిరి - మోత్కురు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

### ఈ ఏడాదిలో జనవరిలో ఒకసారి పేలుడు..

ఈ ఏడాది ప్రారంభంలో ఇదే పీఈఎల్‌కు చెందిన యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూర్‌లో గల కంపెనీలో భారీ పేలుడు జరిగింది. జనవరి 3న పీఈఎల్ కంపెనీలో ఫెర్రోడివైజ్ ఫిల్లింగ్ అండ్ ప్రాసెస్సింగ్ భవనంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు ఎగుమతి చేసే ఫెల్లెట్ పార్ములా( ఐఆర్‌ఫ్లేర్స్) ప్రెస్సింగ్ చేస్తున్న సమయంలో గ్యాస్ ఎనర్జీ రావడంతో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో అక్కడే విధుల్లో ఉన్న జనగామ జిల్లా బచ్చన్నపేట గ్రామానికి చెందిన కార్మికుడు మార్క కనకయ్య(54) మృతి చెందారు. మరో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు.

## వింటే ఓకే.. లేదంటే దాడులు!

### అధికార పార్టీ నేతల దౌర్జన్యకాండ

- **పథకాలకు అర్హుల ఎంపికలో అధికారులపై ఒత్తిళ్లు**
- **జాబితాలో తాము చెప్పిన పేర్లే ఉండాలంటూ హుకూం**
- **ధీరావత్‌తండా పంచాయతీ కార్యదర్శిపై కాంగ్రెస్ నేత దాడి**
- **పోలీసులకు బాధితుడి ఫిర్యాదు.. తోటి ఉద్యోగుల మద్దతు**



మిర్యాలగూడ ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 29 : రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో అధికార పార్టీ నాయకుల మితిమీరిన జోక్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వినకపోతే దాడుల వరకూ వెళ్తుండడం అధికార వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాలో తాము సూచించిన పేర్లు మాత్రమే ఉండాలని అధికార కాంగ్రెస్ నాయకులు హుకూం జారీ చేస్తుండడంతో ఏం చేయాలో అధికారులకు పాలుపోవడం లేదు. క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌ల పాలన ముగియడం, ప్రభుత్వం ఎన్నికలు జరుపకపోవడంతో పాలనా బాధ్యతలు పూర్తిగా పంచాయతీ కార్యదర్శులపైనే పడ్డాయి. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం నిర్వహణ, వీధి లైట్ల ఏర్పాట్ల వంటి అనేక బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్నారు. గ్రామపంచాయతీల నిర్వహణకు నిధులు రాకపోయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో వారే అప్పులు తెచ్చి మరీ సమస్యలు పరిష్కరించాల్సి వస్తున్నది. ఇలా రూ.లక్షల్లో అప్పులు చేసిన వారూ ఉన్నారు. అదేవిధంగా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే, ప్రభుత్వ పథకాలకు సంబంధించి సర్వేలు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాల విషయంలో కార్యదర్శులు సమర్థవంతంగా చేసినా అధికార పార్టీ నాయకుల జోక్యంతో తీవ్ర సమస్యగా మారిందని వాపోతున్నారు.

### బెదిరింపులు... వినకుంటే దాడులు

సంక్షేమ పథకాల అమలులో గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు కీలకంగా పని చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పథకాలకు నిజమైన అర్హులను గుర్తించేందుకు పకడ్బందీగా వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. కాగా, అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు తాము చెప్పిన పేర్లు మాత్రమే అర్హుల జాబితాలో ఉండాలని బెదిరింపులకు దిగుతున్నారు. మాట వినకపోతే భౌతికంగా దాడులకు పాల్పడుతున్నారు. మిర్యాలగూడ మండలం ధీరావత్‌తండా గ్రామపంచాయతీలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఇరిగేషన్ ఏఈ రామకృష్ణతో కలిసి పంచాయతీ కార్యదర్శి కోల సాయికుమార్ ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ సర్వే చేపడుతున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు తాను చెప్పిన పేర్లు ఎందుకు జాబితాలో చేర్చలేదని సదరు పంచాయతీ కార్యదర్శిని బెదిరింపులకు గురిచేశాడు. తాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాత్రమే ఇరిగేషన్ ఏఈతో కలిసి వెరిఫికేషన్ సర్వేలో పాల్గొన్నానని, అర్హుల జాబితా తయారీతో తనకు సంబంధం లేదని చెప్పినప్పటికీ వినకుండా సదరు నాయకుడు పంచాయతీ కార్యదర్శిపై భౌతికంగా దాడి చేశాడు. గ్రామస్తులు వారించినప్పటికీ లెక్కచేయకుండా కార్యదర్శిని దుర్భాషలాడారు. దాడికి పాల్పడిన సదరు నాయకుడిపై బాధిత కార్యదర్శి సాయికుమార్ మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శికి పలువురు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మద్దతుగా నిలిచారు.

### తాను చెప్పిన పేర్లు చేర్చలేదని దాడి చేశాడు



ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ సర్వేలో నేను ఇరిగేషన్ ఏఈతో కలిసి పాల్గొన్నాను. గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు తాను చెప్పిన పేర్లు లిస్ట్‌లో ఎందుకు పెట్టలేదని దుర్భాషలాడుతూ నాపై దాడికి పాల్పడ్డాడు. పథకాల అమలులో సమర్థవంతంగా పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులపై అధికార పార్టీల నాయకుల నుంచి బెదిరింపులు, దాడులు సరికాదు. దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**-కోల సాయికుమార్, పంచాయతీ కార్యదర్శి, ధీరావత్‌తండా**

### దాడులు సరికాదు



ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడం, దాడులు చేయడం సరికాదు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి వెరిఫికేషన్ మాత్రమే జరుగుతున్నది. ఇది తుది జాబితా కాదు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి. కార్యదర్శిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

**-శేషగిరిశర్మ, ఎంపీడీఓ, మిర్యాలగూడ**

## ఇందిరమ్మ ఇల్లు రాలేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- **ఇంటి కోసం రూ.20 వేలు తీసుకున్న అధికార పార్టీ నాయకుడు**
- **ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోవడంతో వాటర్ ట్యాంక్ ఎక్కిన బాధితుడు**



విలేకరులతో తన గోడు వెల్లబోసుకుంటున్న కనకయ్య

తుంగతుర్తి, ఏప్రిల్ 29 : ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఓ వ్యక్తి వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వెలుగుపల్లి గ్రామానికి చెందిన భయ్యా కనకయ్య(33)కు ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని చెప్పి గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు రూ.50 వేలు అడిగాడు. కనకయ్య అంత ఇవ్వలేనని బతిమలాడగా రూ.20 వేలకు ఒప్పుకోవడంతో ఫోన్ పే ద్వారా చెల్లించాడు. తర్వాత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో కనకయ్య పేరు లేకపోవడంతో డబ్బులు తీసుకున్న వ్యక్తి మోసం చేశాడనే ఆవేదనతో గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు. అనంతరం బాధితుడు విలేకరులతో మాట్లాడుతూ తాను నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తినని, గుంట జాగగాని, ఉండడానికి ఇల్లు గాని లేదని వాపోయాడు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో కొందరు కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లంచాలు తీసుకుంటూ పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

## ఇల్లు ఇవ్వకుంటే ఎమ్మెల్యే ఇంటిముందు చస్తా

### చండూరులో ఓ మహిళ ఆందోళన



ఆవేదన వ్యక్తం చేస్తున్న పాలడుగు ముత్తమ్మ

చండూరు, ఏప్రిల్ 29 : ప్రభుత్వం తనకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుంటే ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇంటిముందు ఆత్మహత్య చేసుకొని చనిపోతానని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. వివరాల్లోకి వెళితే చండూరు మండలంలోని నెర్మట గ్రామానికి చెందిన పాలడుగు ముత్తమ్మ అనే దళిత మహిళ కాంగ్రెస్ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'గ్రామంలో ప్రకటించిన లిస్టులో నారు పేరు లేదు, పేద దళిత కుంటుంబానికి చెందిన నాకు ఆస్తులేమీ లేవు. భర్త కూడా చనిపోయిండు.. నాకు ఎందుకు ఇల్లు ఇవ్వలేదు' అని ప్రశ్నించింది. డబ్బులు, భూములు, ఇండ్లు ఉన్నోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని ఆమె ఆరోపించింది. ఎమ్మెల్యే కొంత మంది ఓట్లు వేస్తే గెలువ లేదని, తాము కూడా వేశామని తెలిపింది. ప్రభుత్వం పథకాలు పేదలకు ఇవ్వరా అని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుంటే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇంటిముందు ఆత్మహత్య చేసుకొని చనిపోతానని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

## యువతను విస్మరిస్తే ప్రభుత్వంపై పోరాటం : ఏఐవైఎఫ్





మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లాఖాద్రి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 29 : యువతను విస్మరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటానికి సిద్ధమని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీ ఉల్లాఖాద్రీ, కల్లూరి ధర్మేంద్ర అన్నారు. పట్టణంలో బుధవారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా రెండో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి వైకుంఠ ద్వారం నుంచి మహాసభ ప్రాంగణం వరకు యువజన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎల్లంకి మహేశ్, కొండూరు వెంకటేశ్, మొగుళ్ల శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మహాసభలో వారు మాట్లాడారు. దేశంలో ఉగ్రవాద దాడులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ దేశ భవిష్యత్ నేటి యువతపై ఆధారపడి ఉందన్నారు. మతోన్మాదం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువత నడుం బిగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహాసభలో ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల నివేదికను సంఘం జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు మహమ్మద్ నయీమ్, బద్దుల శ్రీనివాస్, సుద్దాల సాయికుమార్, మొగుళ్ల శేఖర్‌రెడ్డి, కొండూరి వేంకటేశ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు చెక్క వెంకటేశ్ పాల్గొన్నారు.

## సాంకేతిక కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 29 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించే ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సులకు శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో ఆరు నెలల కాల పరిమితితో కూడిన ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్, సర్వీస్ (ఐటీఐ/ డిప్లమో పాస్), కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్ (పదో తరగతి పాస్), టైలరింగ్ ఎంబ్రాయిడరీ, జర్దోజి, క్విల్డ్, బ్యాగ్స్ మేకింగ్ (8వ తరగతి పాస్) వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్, జిరాక్స్ సెట్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో మే 7న ఉదయం 10గంటలకు రామానందతీర్థ సంస్థలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇస్తూ హాస్టల్, భోజన వసతి పాటు ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9133908000, 9133908111, 91339082 22, 9948466111 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.